## క్లుప్తంగా

### వేలాడుతున్న విద్యుత్ తీగలు



రహదారి పక్కనే ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తూర్ వాగు సమీపంలో శ్రీశైలం రహదారి పక్కనే విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. కందుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కొత్తూర్ వైపు ఏర్పాటు చేసిన 11కేవీ లైన్లు అవి. కిందికి వేలాడటంతో ఆ ప్రాంతంలో ఏదైనా ఆటోలు, లారీల్లో వస్తువులు లోడ్ చేయాలన్నా, కిందికి దించాలన్నా హడలిపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### శ్మశానవాటిక స్థలాన్ని కాపాడండి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రవీందర్‌గౌడ్ తదితరులు

కందుకూరు: మండల పరిధి నేదునూరులోని శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురవుతోందని సర్వే చేయించి హద్దులు నిర్ణయించి కాపాడాలని కోరుతూ ఆ గ్రామస్తులు సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ వార్డు సభ్యుడు ఇంద్రకంటి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 300, 302, 322, 344లో శ్మశానవాటిక ఉందన్నారు. ఆ స్థలం చుట్టూ ఆక్రమణకు గురవుతోందన్నారు. సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని కోరామన్నారు.

### పీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కందుకూరు: పీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సభావత్ కృష్ణనాయక్, కో–ఆర్డినేటర్ ఎండీ.అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు సరికొండ పాండు. ఎండీ.ఖాజామొయినుద్దీన్, బుక్క పాండురంగారెడ్డి, సరికొండ జగన్, వరికుప్పల బాబు, నాగిళ్ల రవి, విస్లావత్ శ్రీనునాయక్, మీగడి శేఖర్, ఎండీ రహీస్, శేఖర్, కృష్ణ, జాపాల బలరాం, ఇంద్రకంటి రాకేశ్‌గౌడ్, గాదె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు

యాచారం: మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు చేశారు. సోమవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు జగన్మోహన్ గుప్తాలు.. గడ్డమల్లయ్యగూడ, చింతుల్ల, కుర్మిద్ద, తక్కళ్లపల్లి, కొత్తపల్లి పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదోన్నతులు, బదిలీలు చేపట్టిన సర్కార్, ఇప్పటి వరకు జూలై నెల వేతనాలు అందించకపోవడం శోచనీయమన్నారు. పెండింగ్ డీఏలను ఇవ్వాలని, మెరుగైన ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం యాచారం మండల శాఖ ప్రధాన కార్యదర్శి యాదగిరి, గౌరవ అధ్యక్షుడు బోజయ్య, జిల్లా బాధ్యులు తిరుమలేశ్, శ్రావణ్, మహేశ్, హరిప్రసాద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మరక్షణకు కరాటే దోహదం

కడ్తాల్: ఆత్మరక్షణతో పాటు శరీర దారుఢ్యానికి కరాటే దోహదపడుతుందని, బాలికలు యుద్ధవిద్యపై ఆసక్తి చూపాలని మాస్టర్ సోను అన్నారు. విద్యాశాఖ జిల్లా అధికారి ఆదేశాను సారం సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత కరాటే శిక్షణా తరగతులను ప్రధానోపాధ్యాయురాలు అరుణతో కలిసి మాస్టర్ ప్రారంభించారు. అనంతరం శిక్షకుడు మాట్లాడుతూ.. తమనుతాము రక్షించుకోవడంతో పాటు.. ఆపదలో ఉన్నవారిని కాపాడటానికి మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి పాల్గొన్నారు.

# రేషన్‌పై కొరవడిన పర్యవేక్షణ!

- నాసిరకంగా సరుకుల సరఫరా
- విజిలెన్స్ కమిటీలను నియమించాలని వినతులు



మహేశ్వరంలో రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారుడు (ఫైల్)

మహేశ్వరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యం పంపిణీ పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన పర్యవేక్షణ(విజిలెన్స్) కమిటీలు నామమాత్రమయ్యాయి. పర్యవేక్షణకు డివిజన్, మండల స్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసి, ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై బియ్యం నాణ్యత పంపిణీ తీరు, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారం తదితర అంశాలపై చర్చించాలి. పంపిణీ, అందించడంలో లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. డివిజన్, మండల స్థాయిలో కమిటీలు ఇంకా ఏర్పాటు చేయలేదు. పర్యవేక్షణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిన ఆహార సలహా సంఘాలను తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దు చేసి విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. డివిజన్, మండల స్థాయిలో ఇప్పటి వరకు కమిటీలను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. అధికారులు కమిటీలను నియమించకుండా కాలయాపన చేస్తుందని విమర్శలు వినిపిస్తుంది.

**కమిటీలు ఇలా..**

జిల్లా స్థాయి కమిటీలకు కలెక్టర్, డివిజన్ స్థాయి కమిటీకి ఆర్డీఓ, మండల స్థాయి కమిటీకి తహసీల్దార్ చైర్మన్లుగా ఉంటారు. మండల స్థాయిలో ఎంపీపీ సహా చైర్మన్‌గా ఉంటారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు ముగ్గురు మహిళా ప్రతినిధులు, ఎంపీడీఓ, వ్యవసాయాధికారి, ఇద్దరు జర్నలిస్టులు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు రైతులు, రేషన్ డీలర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి, రాజకీయ పార్టీల నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు.

**సరుకుల నాణ్యతపై ఆరోపణలు**

కమిటీల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యతా ప్రమాణాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలకు నాణ్యతలేని రేషన్ బియ్యం, సరుకులు సరఫరా అవుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం గురించి పట్టించుకునే వారు లేకపోయారు. మండలంలోని కొన్ని రేషన్ దుకాణాల్లో నాసిరకం బియ్యం పంపిణీ అవుతున్నాయని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, హాస్టళ్లలో సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా ఎక్కువగా దొడ్డు బియ్యాన్నే సరఫరా చేస్తున్నారు.

**“ త్వరలో ఏర్పాటు చేస్తాం**



మండల స్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఇంకా చేయలేదు. త్వరలో మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తాం. కలెక్టర్ అనుమతితో కమిటీలను నియమించి సమావేశాలను నిర్వహిస్తాం. ప్రతి హాస్టల్, పాఠశాలలో నాణ్యతతో కూడిన రేషన్ బియ్యం అందించేందుకు కృషి చేస్తాం.

– సైదులు, తహసీల్దార్, మహేశ్వరం

| | |
|---|---|
| మండలంలో రేషన్ దుకాణాలు | - 47 |
| ఆహార భద్రత కార్డులు | - 15128 |
| అంత్యోదయ కార్డులు | - 2657 |
| అన్నపూర్ణ కార్డులు | -11 |

# అభివృద్ధికి నిధులు తీసుకురండి

కాంగ్రెస్ నేతలకు ఎమ్మెల్యే సబితారెడ్డి సవాల్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: తాను శంకుస్థాపన చేసి పూర్తి చేసిన పనుల వద్ద ఫొటోలకు పోజులిస్తున్న కాంగ్రెస్ నాయకులు.. చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెనక్కి తీసుకున్న ఎస్‌డీఎఫ్ నిధులను విడుదల చేయించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సవాల్ విసిరారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో సోమవారం ఆమె 128 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జల్‌పల్లిలో ఇటీవల తాను పూర్తి చేసిన సీసీ రోడ్డు వద్ద కాంగ్రెస్ నాయకులు ఫొటోలు దిగుతూ వారే అభివృద్ధి చేశామనేలా పోజులిచ్చారన్నారు. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.270 కోట్లు మంజూరు చేస్తే.. ప్రభుత్వం మారిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఆ నిధులను వెనక్కి తీసుకున్నారన్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీ, నాలాలు, వంతెనల కోసం కేసీఆర్ మంజూరు చేసిన దాదాపు రూ.10 వేల కోట్లను వెనక్కి తీసుకున్న ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. పేదలు నివాసం ఉండే జల్‌పల్లి మున్సిపాలిటీకి రూ.వంద కోట్లు మంజూరు చేసినా తక్కువే అవుతుందన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులు నిధులు తీసుకొచ్చి ఎన్ని ఫొటోలకైనా పోజులిచ్చుకోవాలని సలహా ఇచ్చారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.లక్ష సాయంతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎప్పుడు తులం బంగారం అమలు చేసినా ప్రస్తుతం చెక్కులు తీసుకుంటున్న వారికి కూడా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బాలాపూర్ తహసీల్దార్ ఇందిరా, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, కౌన్సిలర్లు పల్లపు శంకర్, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, ఆర్ఐ జమీల్, నాయకులు జనార్దన్, షేక్ అఫ్జల్, కొండల్‌యాదవ్, ఆంజనేయులు, యాహ్యా, దస్తగిర్, యూసుఫ్‌పటేల్, ఇక్బాల్ బిన్ ఖలీఫా, బర్కత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

# కార్గో రోడ్డులో కష్ట ప్రయాణం



మామిడిపల్లి-జల్‌పల్లి రహదారిపై నిలిచిన వర్షపునీరు

పహాడీషరీఫ్: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో జల్‌పల్లి మున్సిపాలిటీలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. ఈ రహదారులపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రకుంట ప్రాంతంలోని బారా మల్గీస్ వద్ద పలు చోట్ల రోడ్డు గుంతలమయంగా మారింది. జల్‌పల్లి పి–7 కార్గో రోడ్డుపై కూడా ప్రయాణం నరకంగా మారిందని వాహనదారులు పేర్కొంటున్నారు. శ్రీరాం కాలనీ నుంచి వాంబే కాలనీ రూట్‌లో కార్గో రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో స్థానికులు కర్రను నడిరోడ్డుపై హెచ్చరికగా ఏర్పాటు చేశారు. మామిడిపల్లి నుంచి జల్‌పల్లికి వస్తున్న కార్గో రోడ్డులో ఒకేచోట భారీగా రోడ్డు నిండా నీరు నిలిచిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



వాంబే కాలనీ రూట్‌లో దెబ్బతిన్న రోడ్డు

### పేకాటరాయుళ్ల అరెస్ట్

హస్తినాపురం: పేకాట రాయుళ్లను రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం వనస్థలిపురం ఠాణా పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వనస్థలిపురం పోలీసులకు అప్పగించారు.

### చిన్నారిని ఢీకొట్టిన కారు: స్వల్ప గాయాలు

లింగోజిగూడ: రోడ్డుపై ఆడుకుంటున్న ఓ చిన్నారిని కారు ఢీకొట్టిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్ వీరభద్ర కాలనీ నివాసముండే ధనుంజయ కుమారుడు ఆయాన్స్(02) సోమవారం రోడ్డుపై ఆడుకుంటుండగా గుర్తు తెలియని కారు ఢీ కొట్టడంతో తల, పెదవులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### సీసీరోడ్డు పనుల ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: పుర ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తామని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లి పటేల్‌గూడ 12వ వార్డులో రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. దశల వారీగా మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్ నారని మౌనిక, ధన్‌రాజు, నారాయణ, శివం, బాషమ్మ, శ్రీశైలం, నరసింహ, సత్తయ్య, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

### పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం

సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూ టీఎస్‌తోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా పద్మావతమ్మ, ప్రధాన కార్యదర్శిగా చీమర్ల రాధాకృష్ణారెడ్డి, అసోసియెట్ అధ్యక్షుడిగా వెంకటేశ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా భాగ్యమ్మ, కార్యదర్శిగా రామ్మోహన్‌లను నియమించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా గోవర్ధన్, సామల మాట్లాడుతూ.. త్వరలో ఏకీకృత సర్వీస్ సాధిస్తామని, ఉపాధ్యాయులకు ఎంఈఓలుగా, జేఎల్, డైట్ లెక్చరర్లుగా ప్రమోషన్లు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. నూతన పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పత్రికా సంపాదక వర్గ సభ్యులు జగన్మోహన్ గుప్తా, కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సుదర్శన్, మల్లీశ్వరి, ఉమాదేవి తదితరులు ఉన్నారు.



మండల నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం నాయకులు

# నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు



మంత్రాల చెరువు వద్ద నిమజ్జనంలో పాల్గొన్న మేయర్ దుర్గ, అధికారులు

మంత్రాల చెరువును పరిశీలించిన మేయర్ దుర్గ

మీర్‌పేట: భక్తులకు ఇబ్బందులు లేకుండా గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. సోమవారం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులతో కలిసి మీర్‌పేట మంత్రాల చెరువు వద్ద నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన క్రేన్‌ను మేయర్ పరిశీలించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. నిమజ్జనం సందర్భంగా చెరువు వద్ద లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు గణనాథులతో వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం నిమజ్జనానికి వచ్చిన చిన్న గణపయ్యను మేయర్ చేతుల మీదుగా నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ జ్ఞానేశ్వర్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్లు కరుణానిధి, రవినాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటికెల శ్రీహరి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీలు ఒక్కసారి ఆలోచించాలని స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా బీసీలు అభివృద్ధి చెందలేదన్నారు. మాజీ ప్రధాని వీపీసింగ్ హయాంలో మండల కమిషన్ రిజర్వేషన్లు వివిధ ఒత్తిళ్ల మధ్య మొక్కుబడిగానే అమలు చేశారని విమర్శించారు. మరోవైపు బీజేపీ బీసీ ప్రధాని పేరుతో 2014 ఎన్నికల్లో నరేంద్ర మోదీని ముందుకు తెచ్చిందన్నారు. అయినా ఆయనతో బీసీలకు ఒరిగింది ఏమీలేదన్నారు. రాహుల్‌గాంధీ కులగణన జరిపి ఆ ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలంటున్నారన్నారు. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దాటవేసే ధోరణిని అవలంబిస్తున్నారని ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే బీసీలు ఉద్యమించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట సమాజ్‌వాది పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుకూరు మండల పార్టీ అధ్యక్షుడిగా దెబ్బడగూడకు చెందిన పొడిపాల రమేశ్‌ను, ఉపాధ్యక్షుడిగా దెబ్బడగూడకు చెందిన డేరంగుల యాదగిరిని నియమించినట్లు ఆయన ప్రకటించారు.



బడంగ్‌పేట: గణేశ్ మండపంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, నృత్య కళాకారుల బృందం

### బొజ్జ గణపయ్య.. నిత్య పూజలయ్య

తుక్కుగూడ: వినాయక చవితి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథుల వద్ద పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: రావిర్యాలలో సర్దార్ పటేల్ యువజన సంఘం ఆధ్వర్యంలో..



బడంగ్‌పేట: బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు

# అసాంఘిక కార్యకలాపాలు.. అడ్డుకుంటే మేలు!



చెట్ల కింద గంజాయి మత్తులో యువత

హస్తినాపురం: పార్కులు, చెరువులు, నిర్మానుష్య ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో పేకాట ఆడేవారు, రేషన్ బియ్యం తరలించే వారు, స్పాసెంటర్లపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి పట్టుకుంటే తప్ప స్థానికంగా ఉన్న పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎల్‌బీనగర్, మహేశ్వరం జోన్ల ఎస్‌ఓటీ పోలీసులు ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారో నిఘాపెట్టి వారిపై దాడులు చేసి నిందితులను పట్టుకుంటున్నా స్థానికంగా ఉన్న పోలీసులు ఎందుకు వారిని పట్టుకోవడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిర్మానుష్య ప్రదేశాలు, పార్కులలో మద్యం, గంజాయి తాగుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఉన్నతాధికారులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

# భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం



తాపీ మేస్త్రీలకు బహుమతులను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

లింగోజిగూడ: సిమెంట్ రంగంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ ఎదిగిందని, భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణాలు వేగవంతంగా జరుగుతాయని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రీ తెలిపారు. నాగోలులోని శ్రీసాయి దివ్యస్టీల్, సిమెంట్ ట్రేడర్స్ వద్ద సోమవారం తాపీ మేస్త్రీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అల్ట్రాఫాస్ట్ ప్రధానంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణానికి సరైన ఎంపిక అని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తున్నామని, స్లాబ్‌ల నిర్మాణ సమయంలో నిపుణులైన ఇంజినీర్లు నిర్మాణం వద్దకే వచ్చి సహాయ పడుతారన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రులు సజావుగా జరిగేలా చర్యలు



మినీ ట్యాంక్ బండ్‌పై ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

లింగోజిగూడ: నవరాత్రులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్‌పై వినాయక నిమజ్జన ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్‌పై నిమజ్జనం కోసం 8 క్రేన్లు అందుబాటులో ఉంచామని వివిధ శాఖల అధికారుల సహకారంతో తాగునీరు బారికేడ్లు, లైటింగ్, గజ ఈతగాళ్ల సౌకర్యాలు కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితి పరిశీలించేందుకు పోలీస్ చెక్ పోస్టులు, 55 సీసీ కెమెరాలను సిద్ధం చేశామని అన్ని శాఖల అధికారులతో కలిసి కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య, జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ డీసీ సుజాత ఉన్నారు.